క్లుప్తంగా

పఠాన్‌బాబుకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి నివాళి



చల్లపల్లి(అవనిగడ్డ): ముస్లిం మైనార్టీ నేత పఠాన్ కరీముల్లా తండ్రి పఠాన్‌బాబుకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాబు గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు నేతలు మోపిదేవి ద్వారకానాథ్, పాగోలు సీతారామరావు(ఫణి), యడ్ల రాజేష్, భాగ్యారావు, హర్షద్, కమాల్ తదితరులు నివాళులు అర్పించారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్

అవనిగడ్డ: జాతీయ లోక్‌అదాలత్ డిసెంబర్ 14వ తేదీన జరగనున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ బాబూ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, దీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరిగి కాలం, డబ్బును వృథా చేసుకునే కక్షి దారులు లోక్ అదాలత్ ద్వారా రాజీపడితే అవన్నీ తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాల ఉత్పత్తిదారులకు బంగారు నాణెం

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెం పాలకేంద్రంలో పాల ఉత్పత్తిదారుడు బూసి బాబూరావు కుమారుడు ఫణికుమార్‌కు కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేల విలువైన బంగారు నాణెంతో పాటు సొసైటీ కింద రూ. 10 వేలు నగదును పాల కేంద్రం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు అందజేశారు. గురువారం సాయంత్రం చిరువోలులో జరిగిన కార్యక్రమంలో పాలకేంద్రం సూపర్‌వైజర్ మోర్ల వరప్రసాద్, పాల ఉత్పత్తిదారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ




మోపిదేవి: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు మొదటి విడత పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ తెలిపారు. మోపిదేవి పశువైద్యశాలలో గురువారం గొర్రెలు, మేకల నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. గొర్రెలు 400, మేకలు 38 జీవాలకు నట్టల నివారణ మందును అందించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి పశువైద్యులు, గొరిపర్తి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేయండి



పెడన: ఓటు హక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అన్నారు. గురువారం పెడనలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరుగా నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తవుతున్న వారు.. వయస్సు18కి చేరువలో ఉంటారని కళాశాలలకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు దరఖాస్తులను అందజేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందులో పూర్తి వివరాలను, డేట్ ఆఫ్ బర్త్ వివరాలను పొందుపరిచి, ఆధార్ నంబర్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రామారావు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



కృత్తివెన్ను: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండలంలోని శ్రీదుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. శివాలయం నుంచి గుడిదిబ్బ, పల్లెపాలెం, కృత్తివెన్ను గ్రామాల్లో తీన్మార్ డప్పులు, మేళతాళాలతో సందడిగా ఊరేగింపు సాగింది.

కోడూరు: సంతమార్కెట్ సమీపంలోని కనక దుర్గమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.

సాగు.. కలవరం

- తీరప్రాంత గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన వరి
- నారుమళ్లను కాపాడుకొనేందుకు అన్నదాతలు అగచాట్లు
- సుమారు 3వేల ఎకరాల్లో నారుమళ్లు మునక
- సముద్ర నీరు ఎగతట్టడంతో పొంగుతున్న డ్రెయిన్లు



భారీ వర్షాలకు హంసలదీవి సమీపంలో చెరువులను తలపిస్తున్నపొలాలు

కోడూరు: తీరప్రాంతంలో అన్నదాత అగచాట్లు పడుతున్నాడు. అయితే అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సీజన్ ఆరంభంలో కనీసం వరినారుమళ్లకు సాగునీరు కూడా లేకపోవడం, తరువాత అష్టకష్టాలు పడి వరినాట్లు వేసేందుకు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. భారీ వర్షాలు కురిసి పొలాలు ముంపుబారిన పడడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నీటిని తరలించేందుకు అగచాట్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తీరప్రాంతంలో సాగు చేసిన వరి నారుమళ్లు పూర్తిస్థాయిలో నీట మునిగాయి. కోడూరు ఈస్ట్ ఛానల్ పరిధిలోని 15,16,17,18 నంబర్ల పంటకాలువల కింద ఉన్న సుమారు మూడు వేల ఎకరాల్లో నారుమళ్లు ముంపు బారిన పడ్డాయి. దింటిమెరక, పాలకాయతిప్ప, హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం గ్రామాల్లో పొలాలు ప్రస్తుతం వర్షం నీటితో చెరువులను తలపిస్తున్నాయి. నారుమళ్లలో నీటిని బయటకు తరలించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కొంతమంది ఆయిల్ ఇంజిన్లతో నారుమళ్లలో నుంచి నీటిని బయటకు తరలిస్తుంటే మరికొంతమంది రైతులు గుల్లపంపులు, స్టీల్ పాత్రలతో నీటిని బయటకు పంపుతున్నారు. వెదసాగు చేసిన వరిపొలాలు పూర్తిగా నీటి పాలయ్యాయి.

ఎగతట్టిన సముద్రం ఉప్పునీరు..

పాలకాయతిప్ప, ఉల్లిపాలెం వద్ద కరకట్టకు ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు తోడు పౌర్ణమి పోటు కూడా తోడవ్వడంతో సముద్రం ఉప్పునీరు పైకి ఎగతట్టింది. పొలాల్లో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక ఉప్పునీరు కూడా పైకి రావడంతో డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం డ్రైన్లలో నీరు వరిపొలాల గట్లకు సమాంతరంగా ప్రవహిస్తుండడంతో ముంపు సమస్య మరింత అధికమైంది.

అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు ఆటోమెటిక్ షటర్లు ఉంటే పొలాలు ముంపుబారిన పడేవి కాదని రైతులు అంటున్నారు.



పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద ఎగువకు ప్రవహిస్తున్న ఉప్పునీరు

పరిహారం అందించని ప్రభుత్వం..

సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు ఈ కాలువల కింద వరినారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరద నీరు ఎగువకు రాకుండా స్లూయిస్‌లకు అడ్డుగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సుమారు రెండు వేల ఎకరాల్లో సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటిందేగానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు జరగలేదు. నారుమళ్లకు పరిహారం రాదంటూ వ్యవసాయ అధికారులు మాట దాట వేశారని రైతులు ఆరోపిస్తున్నారు.

అమలుగాని హామీలు

అధికారంలోకి రాగానే తీరప్రాంత రైతుల సమస్యను తీరస్తామని కూటమి నేతలు ఊకదంపుడు ఉపన్యాసలిచ్చారు. ప్రస్తుతం తీరప్రాంతంలో వ్యవసాయం లేక ఇబ్బందులు పడుతున్నా కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణం చేపట్టి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారే గానీ హామీలు సముద్ర నీటిలో కలిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలు పరిశీలించడానికి ఎవరూ రాలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.



వరి పొలాల్లో నీటితో పాటు సమాంతరంగా ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

రెండోసారి కూడా నీట మునిగింది



15వ నెంబర్ పంటకాలువ కింద ఐదు ఎకరాల వరి పొలం ఉంది. ఆగస్టు చివరిలో వరినారుమళ్లను సిద్ధం చేశాను. అయితే సెప్టెంబర్‌లో వచ్చిన వరదలకు పొలాలు ముంపుబారిన పడి నారుమళ్లు దెబ్బతిన్నాయి. మళ్లీ సెప్టెంబర్ మూడో వారంలో రెండోసారి నారుమళ్లు పోశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఈ నారుమడి కూడా దెబ్బతింది. ఇప్పటికే సుమారు 40వేలకు పైగా ఖర్చు చేసినా ప్రయోజనం లేదు.

– అడుసుమిల్లి సాయిబాబు, రైతు, కోడూరు

నష్టపరిహారం కూడా అందించలేదు



16వ నెంబర్ పంటకాలువ కింద మూడు ఎకరాల వరిపొలం ఉంది. మొదట్లో వేసిన వరి నారుమడి దెబ్బతినడంతో మళ్లీ రెండవసారి వేశాను. మొదటిసారి నారుమడి దెబ్బతిందని వ్యవసాయ అధికారులకు చెప్పినా కూడా నష్టపరిహారం అందించలేదు. ప్రస్తుతం రెండోసారి వేసిన నారుమడి కూడా ఇప్పుడు కురిసిన వర్షాలకు దెబ్బతింది.

– చేబోయిన పుల్లయ్య, రైతు

బార్ కౌన్సిల్ స్టాంపులు విడుదల



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కోర్టు ఆవరణలోని మచిలీపట్నం బార్ అసోసియేషన్‌లో బార్ కౌన్సిల్ స్టాంపులను గురువారం విడుదల చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులు ఆయా కేసులకు సంబంధించి వకాలాత్, మెమో ఫైల్ చేసేటప్పుడు తప్పనిసరిగా రూ. 250 స్టాంపులు వినియోగించడం ద్వారా న్యాయవాదులకు, న్యాయవాదుల గుమాస్తాలకు సంక్షేమనిధి ఏర్పడుతుందన్నారు. రూ. 250స్టాంపులో రూ. 200 న్యాయవాదుల సంఘానికి, రూ. 50 న్యాయవాదుల గుమాస్తాలకు నిధి ఏర్పడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మొహమ్మద్‌రఫీ, ఎస్ మల్లేశ్వరరావు, లంకే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తాం



గూడూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గూడూరు, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాల్లో నిర్మిస్తున్న సిమెంటు రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా చేపట్టిన పనులను సంక్రాంతి లోపు పూర్తి చేస్తామన్నారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

పెడన: మహాకావ్య రచయిత, మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో వాల్మీకి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిగిలిన ఉద్యోగులు పూలుచల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి కె.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఇన్‌చార్జి ఆర్‌ఐ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం డీటీ నరసింహారావు, సర్వేయర్ దాస్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం స్థానిక లేడీయాంప్థిల్ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి పీబీ సాల్మన్‌రాజు, కళాశాల అధ్యాపకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్‌బాబు, అధ్యాపకులు విజయశ్రీ, మమత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాస్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



వాల్మీకి జయంతి వేడుకల్లో కమిషనర్ గోపాలరావు తదితరులు



అవనిగడ్డ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి ప్రభుదాస్

ప్రాచీన కళలను పరిరక్షించాలి

చిట్టూర్పు(ఘంటసాల): ప్రాచీన భారతీయ కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు శివాలయం కమిటీ ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన కృష్ణా–ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాటం పోటీలు నిర్వహించగా ఆయా పోటీల్లో విజేతలకు గురువారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, సీనియర్ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, యార్లగడ్డ శ్రీనివాసరావు, గుత్తికొండ వర ప్రసాద్, ఉప సర్పంచ్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరికి ప్రత్యేక పూజలు

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి పంచాయతీ పరిధిలోని నడకుదురులో బాలాత్రిపుర సుందరి దేవికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు కంఠంరాజు సాయిబాబు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు.

పల్లెలకు పండుగ కళ

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లెలకు పండుగ కళ వచ్చిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని మోపిదేవి, పెదప్రోలు గ్రామాల్లో రూ. 5,63,20,000తో 86 సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శ్రీకారం చుట్టారు. మోపిదేవి గ్రామంలో రూ.1.19 కోట్లతో 12 సీసీ రోడ్లు, పెదప్రోలు గ్రామంలో రూ.35.10 లక్షలతో 12 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పెదప్రోలులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వివరించారు. నేతలు మండలి వెంకట్రామ్, ఎంపీపీ రావి దుర్గావాణి, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, పొలిమెట్ల ఊసుబాబు తదతరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ప్రారంభించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

'సీఆర్' సేవలు మరింత విస్తృతం

చల్లపల్లి(అవనిగడ్డ): చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించి పేదలకు మరిన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కె. నారాయణ చెప్పారు. చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కొండాపూర్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సీఆర్ ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 15 వేల మందికి ఉపాధిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని సీఆర్ ఫౌండేషన్‌కు అనుసంధానం చేసే దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. దివిసీమలో పుట్టిన చంద్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని ఆయన స్ఫూర్తితో పేదలకు ఉపయోగపడేలా సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నేత అక్కినేని చంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.



సీఆర్ వికాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు నారాయణ

ఎటు చూసినా చెత్తే...



మాట్లాం గ్రామంలో జగనన్న కాలనీ సమీపంలో నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్తనిల్వలు



పాఠశాలకు వెళ్లే దారిలో తీవ్ర దుర్గంధం వస్తుండటంతో ముక్కు మూసుకుని పరుగులు తీస్తున్న విద్యార్థులు

కృత్తివెన్నులో కొరవడిన పారిశుద్ధ్యం

కృత్తివెన్ను: ఎటుచూసినా మురుగు నిల్వలతో కృత్తివెన్ను మండలం కనిపిస్తోంది. కొరవడిన పారిశుద్ధ్యంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు, అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థతో గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. ప్రధానంగా దోమలు వ్యాపించి టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా మొదలైన వ్యాధులు సోకుతాయన్న భయం వారిలో వ్యక్తమవుతోంది.

పారిశుద్ధ్య చర్యలు సున్నా

మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు లోపించాయన్నది వాస్తవం. ఇటీవల కురిసిన అధికవర్షాల సమయంలో ఎక్కడ లేని హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు కనీసం సున్నం, బ్లీచింగ్ కూడా చల్లడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో వాటితో వ్యాపించే దుర్గంధంతో పాటు దోమలు పెరుగుతుండటంతో చెత్తను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డ్‌ను తలపించేలా..

సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీటి నిల్వలే దర్శనమిస్తున్నాయి. మాట్లాం గ్రామంలో ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో డంపింగ్ యార్డును తలపించేలా చెత్తనిల్వల నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ దారిలోవిద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అధికార యంత్రాంగం గ్రామాల్లో పారిశుద్ధ్యం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కృత్తివెన్నులో సిమెంటు రోడ్డుపై నిలిచిన నీరు

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం



చల్లపల్లి(అవనిగడ్డ): మాజీ సర్పంచ్ వరదా రామారావు 4వ వర్థంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు వరదా హరగోపాల్ స్వచ్ఛసుందర చల్లపల్లికి రూ.10 వేలు విరాళం అందించారు. ఈ మేరకు స్వచ్ఛ చల్లపల్లి నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌కు చెక్ అందజేశారు. రామారావు కుటుంబం ఇప్పటి వరకూ స్వచ్ఛ సుందర చల్లపల్లికి రూ.1.15లక్షలు విరాళం అందించడం అభినందనీయమన్నారు.

జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక



తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి సూచించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో చెస్, యోగా టీంల ఎంపిక గురువారం జరిగింది. ఎంపికైన విద్యార్థులు నున్నలో జరిగే ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం ఫణి రాజమోహన్ తెలిపారు. నియోజకవర్గ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఇన్‌చార్జి జవహర్‌బాబు, పీడీలు లక్ష్మణరావు, బాలస్వామి, మాసిల్‌మని, పాల్, రవీంద్రబాబు, నందకిషోర్, గ్లాడిసన్, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రీజినల్ ఇన్‌స్పెక్టర్ పరిశీలన



పెడన: బాలికల ఉన్నత పాఠశాలలు, కో ఎడ్యుకేషన్ పాఠశాలల్లో వసతులను ఉమెన్స్, కో ఎడ్యుకేషన్ రిజినల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మహబూబ్‌బాషా పరిశీలించారు. గురువారం ఆయన పెడన బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలించి హెచ్‌ఎం తీర్థవతితో పాటు సీనియర్ ఉపాధ్యాయుడు కేవీ ఉమామహేశ్వరరావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా రెండు మూడు పాఠశాలలను విజిట్ చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు కృష్ణాజిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ గంగాధర్, పెడన నియోజకవర్గ సంఘ నాయకుడు సీహెచ్ మురళీకృష్ణ, పెడన బీజీకే జెడ్పీహెచ్‌ఎస్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ఎస్ఆర్‌కే శాస్త్రి, కె నాగలక్ష్మి, ఎన్‌వీ ఉషశ్రీ పాల్గొన్నారు.

- **ప్రశాంతంగా టెట్**

పెడన: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో టెట్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఆయా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 1,335 మందికి గాను 1,242 మంది హాజరయ్యారు. రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1,155 మందికి గాను 888 మంది పరీక్ష రాయగా 267 మంది హాజరవ్వలేదు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మచిలీపట్నం బ్రాంచి వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలులో చూపిన బొండాడ రామకృష్ణ గారి కుమారుడు బొండాడ విక్రమ్‌శ్రీ గారి స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేసుకుని ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైనను ఎటువంటి అభ్యంతరాలు గానీ, జప్తులు, ఛార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోపు ఈక్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియ జేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం టౌన్, జగన్నాథపురం నందు గల పాత డోర్ నెం. 11/672కు (ప్రస్తుత డోర్ నెం. 11/696–1 కు లో దస్తావేజు నెం. 4959/2008కులో గల 1వ ప్రతి : 7.66 చ॥గజాల ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** 2వ ప్రతి 9-10 అ॥లు, **దక్షిణం :** బి.వి.రంగాచార్యులు గోడ 8 అ॥లు, **పడమర:** బి.వి. రంగాచార్యులు గోడ 8 అ॥లు, **ఉత్తరం:** టి. జగన్నాథం ప్రహరీ గోడ 7.6 అ॥లు 2వ ప్రతి : 158.33 చ॥గజాల స్థలం అందుగల భవంతికి హద్దులు. **తూర్పు :** మున్సిపల్ రోడ్డు 23-11 అ॥లు, **దక్షిణం :** బి. రామకృష్ణ ప్రహరీ గోడ 59.9 అ॥లు, **పడమర:** బి.వి. రంగాచార్యులు గోడ 15.6+9.10 అ॥లు, **ఉత్తరం:** టి. జగన్నాథం ప్రహరీ గోడ. 56 అ॥లు. మెరశి 2 ప్రతులు 166 చ॥ గజాలు.

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం